క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి నిధులు

భైంసాటౌన్: మండలంలోని దేగాం గ్రామంలో దత్తాత్రేయ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ఎస్‌డీఎఫ్ ద్వారా రూ.9.26 లక్షల నిధులు మంజూరు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆలయ కమిటీ సభ్యులకు ప్రొసీడింగ్ కాపీ అందజేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్రే, జిల్లా కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు సమరసింహారెడ్డి, నాయకులు షఫీ, తదితరులున్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ముధోల్ నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా కాంబ్లే సాహెబ్‌రావుకు నియామకపత్రం అందజేశారు.

నూతన కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో శుక్రవారం విద్యుత్‌శాఖ పెన్షన్‌దారుల సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో జిల్లా అధ్యక్షుడిగా ఎస్.రామ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రాజేశ్వర్, అసోసియేట్ కార్యదర్శిగా అంజయ్య, కోశాధికారిగా పోశెట్టి, ఉపాధ్యక్షులుగా రేగుంట రాజేశ్వర్, లక్ష్మీరాజం, ఆఫీస్ సెక్రటరీగా గజ్జారాం, తదితర సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గాజుల సవ్వడి



గాజులు వేసుకుంటున్న మహిళలు

కుంటాల: మండలకేంద్రంలోని వినాయకనగర్‌లో శుక్రవారం మహిళలు గాజుల సవ్వడి కార్యక్రమం నిర్వహించారు. చేతులకు గోరింటాకు పెట్టుకొని ఒకరికొకరు పసుపు, కుంకుమ వాయినాలు ఇచ్చిపుచ్చుకొని గాజులు వేసుకున్నారు.

ఆలయంలో పూజలు

కుంటాల: మండలకేంద్రంలోని శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో భృగువాసర శుక్రవారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకం, అలంకరణ, అర్చన, హారతి తదితర పూజాది కార్యక్రమాలు చేపట్టారు.

పనులు వేగవంతం చేయాలి

ఖానాపూర్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా పూర్తయ్యేలా దృష్టి సారించాలని ఎంపీడీవో రత్నాకర్‌రావు అన్నారు. మండలంలోని రాజూరా గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం రాజూరా, బావాపూర్(ఆర్), సింగాపూర్, చందునాయక్‌తండా, దాసునాయక్‌తండా పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ఇళ్లు నిర్మించే మేస్త్రీలతో ఏర్పాటు చేసిన క్లస్టర్‌స్థాయి సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో చిన్నం రవీందర్, నిమ్యానాయక్, ఫరీద్, అశోక్, లావణ్య, గంగవ్వ, లక్ష్మణ్, సుజాత, నారాయణరెడ్డి, నర్సారెడ్డి, రాజేందర్, శంకర్ తదితరులున్నారు.

నిజాయతీ చాటిన యువకులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గాజులపేట్‌కు చెందిన ఎంఏ.మాలిక్, తౌహీద్ నిజాయతీని చాటుకున్నారు. శుక్రవారం సాయంత్రం బయలు బజార్‌లో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వారికి ఐఫోన్ ప్రో 14 దొరికింది. అది ద్యాగవాడకు చెందిన సుధాచరణ్‌గా గుర్తించారు. ఈమేరకు ఏఎస్పీ రాజేశ్‌మీనాకు ఫోన్ అందించారు. పోలీసులు బాధితుడిని పిలిపించడంతో ఏఎస్పీ ఆధ్వర్యంలో అందించారు. మాలిక్, తౌహీద్‌ను ఏఎస్పీ అభినందించారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ




ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ముధోల్: మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా శుక్రవారం మండలకేంద్రంలో మిలాద్ ఉన్ నబీ ఘనంగా నిర్వహించారు. ముస్లిం మతపెద్దల ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ తీశారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సీఐ మల్లేశ్, ఎస్సై బిట్ల పెర్సిస్ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

చేతిపంపు ఏర్పాటు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బంగల్‌పేట్ శివారులో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ చేతిపంపు ఏర్పాటు చేయించారు. ప్రతి బోరుబావి దగ్గర చేతి పంపును బిగించనున్నట్లు కమిషనర్ తెలిపారు. దీంతో డబుల్ బెడ్ రూమ్ కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తూ మున్సిపల్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



పేరు, ఫోన్ నంబర్లేవి?

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని బీసీ బాలుర వసతిగృహంలో ఏవైనా ఇబ్బందులుంటే విద్యార్థులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేలా ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. కానీ ఫ్లెక్సీలో అప్పిలేట్ అధికారి, ప్రజా సమాచార అధికారి, సహాయ పౌర సమాచార అధికారుల పేర్లు, వారి ఫోన్ నెంబర్లు మాత్రం రాయడం మరిచారు. అధికారుల పేర్లు, వారి ఫోన్ నెంబర్లు రాయాలని విద్యార్థులు కోరుతున్నారు.



సారూ.. ఈ రోడ్డు పట్టించుకోరూ

లోకేశ్వరం: భారీవర్షాలకు మండలంలోని సాథ్‌గాం– భైంసా మండలం పెండిపల్లి గ్రామాల మధ్య ఉన్న తారురోడ్డు దెబ్బతింది. సుద్దవాగు వరద ఉధృతికి సాథ్‌గాం శివారులో లోలెవల్ వంతెన వద్ద రోడ్డు కొట్టుకుపోయింది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులకు ప్రమాదం పొంచి ఉంది. అధికారులు రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని ప్రజలు వేడుకుంటున్నారు.



తవ్విన మట్టి తొలగించరూ..

కుభీర్: మండలకేంద్రం నుంచి కస్రా వెళ్లే మార్గంలో కుభీర్‌లో ఓ షాపింగ్ కాంప్లెక్స్ యజమాని మురుగునీరు వెళ్లేందుకు నెలరోజుల కిందట ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కనే తవ్వి పైపులైన్ వేశారు. కానీ రోడ్డుపై పోసిన మట్టి తొలగించకపోవడంతో రహదారి ఇరుకుగా మారి ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై మట్టి తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

జోరుగా పేకాట..!

- సరదాగా మొదలై.. వ్యసనంగా
- జిల్లాలో ఆర్థికంగా చితికిపోతున్న కుటుంబాలు
- పోలీసులు దాడులు చేస్తున్నా.. మారని పలువురి తీరు

భైంసాటౌన్: భైంసా పట్టణంలోనే కాకుండా జిల్లాలోని మండలకేంద్రాలు, గ్రామాల్లో పేకాట కోరలు చాస్తోంది. చాప కింద నీరులా వ్యాపిస్తోంది. పేకాటరాయుళ్లు కొందరు రహస్య స్థావరాల్లో అడ్డాలు ఏర్పాటు చేసుకుని గుట్టుగా పేకాడుతున్నారు. మొదట సరదాగా మొదలుపెట్టి తరువాత వ్యసనంగా మారి ఎంతోమంది జూదం, పేకాటబారిన పడుతున్నారు.



కొందరు వ్యాపారులు, నాయకులు..

ముఖ్యంగా కొందరు వ్యాపారులు, చోటామోటా నాయకులు కొందరు ఆదివారాలు, సెలవు దినాల్లో వారివారి స్థావరాల్లో రూ.వందలు మొదలు రూ.వేలల్లో పెట్టి పేకాడుతున్నారు. పట్టణంలోని పాత బంగారు, వెండి వర్తక దుకాణ సముదాయం ప్రాంతంలో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, నిర్మల్ చౌరస్తా, బాసర మార్గంలోని ఓ భవనంలో పేకాట స్థావరాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. పైన తెలిపిన ప్రాంతాల్లో పేకాడుతూ పదుల సంఖ్యలో పేకాటరాయుళ్లు పోలీసులకు పలుమార్లు పట్టుబడిన సందర్భాలున్నాయి.

సెలవు దినాల్లో..

పేకాటరాయుళ్లు పలు ప్రాంతాల్లో అడ్డాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. సాయంత్రం, రాత్రి వేళల్లో ఎక్కువగా పేకాడుతుంటారు. ఆదివారాలు, సెలవు దినాల్లోనూ ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం వినాయక నవరాత్రోత్సవాల్లోనూ కొందరు పేకాడుతున్నట్లు సమాచారం. పోలీసులు అడపదడపా దాడులు చేస్తున్నా.. తీరు మార్చుకోవడం లేదు. ఎప్పటికప్పుడు తమ స్థావరాలు మార్చుకుంటూ పేకాట కొనసాగిస్తున్నారు. జూదం వ్యసనంగా మారడంతో కొందరు ఆర్థికంగా ఇబ్బందులు కొని తెచ్చుకుంటున్నారు. మరికొందరు అప్పుల పాలై రోడ్డు మీదకు వస్తున్నారు.

పల్లెల్లోనూ..

పట్టణాలు, మండలకేంద్రాలే కాక పల్లెల్లోనూ జూదం జోరుగా నడుస్తోంది. దీంతో కొన్నిచోట్ల రోజువారీగా పను లకు వెళ్లేవారు సైతం ఈ ఆటకు బానిసలవుతు న్నారు. పోలీసులు మ రింత దృష్టి సారించి పేకాట నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కేసులు నమోదు చేస్తాం...

పేకాడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటున్నాం. ఎవరైనా పేకాట ఆడుతూ పట్టుబడితే కేసులు నమోదు చేస్తాం. ఎక్కడైనా పేకాట స్థావరాలుంటే పోలీసులకు సమాచారమివ్వాలి. నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటాం.

– అవినాష్ కుమార్, ఏఎస్పీ, భైంసా

పట్టుబడిన కేసులు కొన్ని..

- గతేడాది ఆగస్టులో పట్టణంలోని భైంసా –బాసర మార్గంలో రహదారి పక్కన గల ఓ భవనంలో పేకాడుతూ 12 మంది పట్టుబడ్డారు. పట్టుబడిన వారిలో రాజకీయ నాయకులు, బంగారు, వెండి వర్తకులు, కమీషన్ ఏజెంట్లు, పత్తి వ్యాపారులు, ఇతరులు ఉన్నారు. వీరి నుంచి రూ.57వేల నగదు, రెండు బైక్‌లు, కారు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.
- రెండునెలల కిందట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుకాల ఓ దుకాణంలో పేకాడుతూ పలువురు పట్టుబడగా వారి నుంచి నగదు, సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీరిలోనూ కొందరు చోటా లీడర్లు, బంగారు, వెండి వర్తకులు, కమీషన్ ఏజెంట్లు, ఇతరులున్నారు.
- వారంరోజుల కిందట పట్టణంలోని ఏపీనగర్‌లో ఏడుగురు పేకాడుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి రూ.9710 నగదు స్వాధీనం చేసుకున్నారు.
- మళ్లీ రెండురోజుల వ్యవధిలోనే పట్టణంలోని ఆటోనగర్ ప్రాంతంలో మరో ఏడుగురు పేకాడుతూ పోలీసులకు చిక్కారు. వీరి వద్ద నుంచి రూ.22వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం



సోన్‌లో క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు



ఖానాపూర్‌లో క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు

సారంగపూర్: వివిధ రకాల వస్తువులపై జీఎస్టీ స్లాబ్‌లు తగ్గించాలని నిర్ణయించినందుకు శుక్రవారం మండలకేంద్రంలో ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. శ్రావణ్‌కుమార్ బీజేపీ మండలాధ్యక్షుడు నరేశ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

సోన్: మండలకేంద్రంలో ప్రధాని మోడీ చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు మార గంగారెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ ముత్యపల్లి నరేష్, ప్రధాన కార్యదర్శి మామిడాల సంతోష్, జక్క రాజేశ్వర్, సుంచు నవీన్, ఉపాధ్యక్షుడు బోనగిరి గంగయ్య, నాయకులు మూఢ భూమేష్, రాజనరసయ్య, మనోహర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: దేశంలోని పేదలకు మేలు చేసేలా జీఎస్టీ పన్నుల భారాన్ని తగ్గించిన కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. శుక్రవారం పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో ప్రధాని మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పుప్పాల ఉపేందర్, కీర్తి మనోజ్, రవీందర్‌రెడ్డి, నాయిని సంతోశ్, మదిరె శ్రీనివాస్, తిరుమలగిరి, సుధాకర్, సురేశ్, సాయికృష్ణ, నారాయణ, వినోద్, నవీన్ తదితరులున్నారు.

కుంటాల: మండలంలోని కల్లూరులో ప్రధాని నరేంద్రమోడీ చిత్రపటానికి బీజేపీ నేతలు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల కన్వీనర్ పసుల నవీన్, బూత్ అధ్యక్షుడు శ్రీను, సోషల్ మీడియా కన్వీనర్ సిందె దిగంబర్ పటేల్, నాయకులు నవీన్‌రెడ్డి, సత్యాజీ, దత్తు, సాయి, లక్ష్మణ్, కాశీరాం పాల్గొన్నారు.

ముధోల్: మండలకేంద్రంలో పలువురు బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్రమోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

సదరు బోనాల పండుగ

ఖానాపూర్: మండలంలోని బావాపూర్(ఆర్) తండాలో సదరు బోనాల పండుగ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని జగదాంబమాత, సేవాలాల్ మహారాజ్ ఆలయానికి మహిళలు ఊరేగింపుగా వెళ్లి బోనాలను నైవేద్యంగా సమర్పించారు. శారదాబాయి ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఆలయం వద్ద బోనాలతో భక్తులు

‘ఉపాధి’ పనులు పరిశీలించిన సభ్యులు

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి, రాయపూర్ కాండ్లీ, బామ్ని(కే), మన్మద్ గ్రామాల్లో శుక్రవారం సామాజిక తనిఖీ బృందం సభ్యులు ఉపాధిహామీ ప నులను పరిశీలించారు. సీసీరోడ్లు, చెరువులో పూడికతీ త పనులు, పశువుల షెడ్లు, మొక్కలను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఎంపీడీవో సోలమాన్‌రాజ్, ఏపీవో అనిల్, డీఆర్పీ శ్రీకాంత్, తనిఖీ బృందం సభ్యులు ఉన్నారు.



బామ్ని(కే)లో పశువుల షెడ్డు పునాది తవ్వి పరిశీలిస్తున్న తనిఖీ బృందం సభ్యులు

8న మహాసభ జయప్రదం చేయాలి

కడెం: మండలంలోని నర్సాపూర్ గోండుగూడలో ఈనెల 8న నిర్వహించే రాజ్‌గోండ్ రాయిసెంటర్ ఉమ్మడి జిల్లా మహాసభను జయప్రదం చేయాలని రాజ్‌గోండ్ సేవాసమితి జిల్లా అధ్యక్షుడు ఆత్రం రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి ఆత్రం భీంరావు పిలుపునిచ్చారు. శుక్రవారం కడెం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇందులో నాయకులు వెడ్మ పరుశురాం, తులసీరాం, భీంరావు, జనార్దన్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న రాజేశ్వర్

కర్ర వినాయకుడి ఆలయ అభివృద్ధికి కృషి

తానూరు: ఆదర్శంగా నిలుస్తున్న మండలంలోని భోసి గ్రామ కర్రవినాయకుడి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి కర్ర వినాయకుడికి నిర్వహించిన హారతి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేశారు. అనంతరం గ్రామ కమిటీ సభ్యులు గణేశ్ చిత్రపటం అందించి ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఉత్తం బాలేరావ్, వీడీసీ అధ్యక్షుడు బాలాజీ, పలువురు బీజేపీ నాయకులు చిన్నారెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



వినాయకుడికి హారతినిస్తున్న ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



తానూరు: కోలూరు రెండో అంగన్‌వాడీ కేంద్రంలో



కుంటాలలో..



ముధోల్ శిశుమందిర్ పాఠశాలలో..

జిల్లాలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు చెప్పారు. అనంతరం రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. –సాక్షి నెట్‌వర్క్

గణపయ్యకు ఘనంగా వీడ్కోలు



లక్ష్మణచాందలో..



నిమజ్జనంలో నిర్మల్ అల్ఫోర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు



లోకేశ్వరం: పంచగుడి గ్రామ సమీపంలో గోదావరి వంతెన వద్ద గణనాథులు

నిర్మల్‌టౌన్/లోకేశ్వరం/కుంటాల/కుభీర్/బాసర: జిల్లావ్యాప్తంగా శుక్రవారం వినాయకుడి నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలు పూర్తయినందున చివరిరోజు ఉదయం మండపాల వద్ద ప్రత్యేక పూజలు, అన్నదానం చేశారు. బ్యాండ్ మేళాల నడుమ వీధుల గుండా సాగిన శోభాయాత్రలో యువత నృత్యాలతో సందడి చేశారు. అనంతరం సమీపంలోని వాగులు, కుంటల్లో ప్రతిమలను నిమజ్జనం చేశారు. లోకేశ్వరం మండలంలోని పంచగుడి, గౌడిసెరా తదితర గ్రామాల్లో గోదావరి వంతెన వద్ద భారీ క్రేన్ల సాయంతో నిజామాబాద్ జిల్లాకు చెందిన ప్రతిమలను నిమజ్జనం చేశారు. బాసరలో గోదావరి వంతెన వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. నది వద్ద గజ ఈతగాళ్లను, బోటింగ్ పాయింట్, బ్రిడ్జికి ఇరువైపులా విద్యుత్ అలంకరణ, క్రేన్లు ఏర్పాటు చేశారు. ఎస్పీ, ఇతర ఉన్నతాధికారులు గోదావరి వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కుంటాల: లింబా(బి)లో గణేశుడి మండపం వద్ద భక్తులు



నిమజ్జనానికి వెళ్తున్న బాసరలోని శ్రీ సార్వజనిక్ గణేశ్ మండలి ఏర్పాటు చేసిన ప్రతిమ

లడ్డూ దక్కించుకున్న విశ్రాంత సైనికుడు

లక్ష్మణచాంద: హనుమాన్ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూకు వేలంపాట నిర్వహించారు. లక్ష్మణచాందకే చెందిన రిటైర్డ్ ఆర్మీ సైనికుడు శ్రీనివాస్–తిరుమల దంపతులు రూ.15,100కు దక్కించుకున్నారు.

అంబకంటిలో ముస్లిం విద్యార్థి..

కుంటాల: గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని అంబకంటి గ్రామంలో నిమజ్జనం నిర్వహించారు. ఈసందర్భంగా లడ్డూ వేలంపాట నిర్వహించగా గ్రామానికి చెందిన ఎస్‌కే.రహన్ అనే విద్యార్థి రూ.1100కు లడ్డూ దక్కించుకున్నాడు.



కుభీర్ : విఠలేశ్వర మందిరంలో గణనాథుడు



లక్ష్మణచాందలో లడ్డూతో దంపతులు



కుంటాల: లడ్డూ దక్కించుకున్న రహన్

గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించాలి

కడెం: మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం ఆదిలాబాద్‌లో ఎంపీ నగేశ్‌ను బీజేపీ మండలాధ్యక్షుడు కాశవేని శ్రీనివాస్‌యాదవ్ కలిసి వినతిపత్రం అందజేశారు. అల్లంపల్లి వంతెన నిర్మాణం, మిద్దెచింతకు విద్యుత్ సౌకర్యం, గండిగోపాల్‌పూర్, ఇస్లాంపూర్‌కు త్రీఫేజ్ కరెంట్ సౌకర్యం, కుర్రగూడెం వంతెన నిర్మాణం, నవాబ్‌పేట్‌లో పోడు భూముల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరినట్లు పేర్కొన్నారు.



ఎంపీ నగేశ్‌తో బీజేపీ నాయకులు